# 4. అనూరాధా స్వయం వరం

రెండు మూడు పర్యాయాలు అనూరాధ తమ ఇంటికి వచ్చి ఎంతో ప్రేమాభిమానాలు చూపెట్టటం చూసి హరి తల్లిదండ్రులకు ఆనందమూ, ఆశ్చర్యమూ కలిగాయి. ఎంత మంచి అమ్మాయి! ఎంత వినయం! అంత ధనవంతురాలైనా ఏ మాత్రం గర్వం ఆమెలో లేదు. హరి పట్ల ఆమెకెంతో ప్రేమ ఉందన్న విషయం ఆమె ముఖ కవళికలు చూస్తేనే తెల్సిపోతుంది.

మూడోసారి అనురాధ వచ్చి వెళ్ళింతర్వాత ఆమెతో ఉన్న సంబంధం గూర్చి హరిని అతని తల్లి ప్రశ్నించటం జరిగింది. జీవితంలో తనకు వివాహమంటూ జరిగితే అది అనూరాధతోనే జరుగుతుందనీ, ఆమె రూపం తన హృదయంలో స్థిరంగా నాటుకుపోయిందనీ, మరో అమ్మాయి గూర్చి ఆలోచించటం గూడా తనకు సాధ్యంకాదనీ, అతను వాత్సల్యమూర్తి అయిన తన తల్లితో చెప్పటం జరిగింది. అనూరాధ పట్ల తనకేర్పడ్డ ప్రేమానుబంధం గూర్చి ఉత్సాహభరితంగా అతను చెప్పుకుపోతుంటే ఆమెకు అటు ఆనందమూ ఇటు ఆశ్చర్యమూ కలిగినా ఏదో అవ్యక్తమైన భయంకూడా ఆమెలో కదలాడింది. ఈ విషయం గూర్చి ఆమె భర్తతో చర్చించింది.

"కనకం..... నాకెందుకో భయంగా ఉంది, బాల్యం నుండీ తాండవకృష్ణ నాకు దగ్గర మిత్రుడన్న విషయం వాస్తవమే. కానీ, ఈ రోజు అతని స్థాయి ఏమిటి? మన స్థాయి ఏమిటి? అంత సంపన్నుడైనందున తన ఏకైక పుత్రికను మరో ధనవంతుడికిచ్చి వివాహం జరిపిస్తాడట అంటూ తన ఆందోళనను వ్యక్తం చేశాడు నాగభూషణం.

"మీరన్నది నిజమే, కానీ మన హరికి మాత్రం ఏంతక్కువ? వాడి దగ్గర

ప్రస్తుతం అంతడబ్బు లేకపోవచ్చు, వకీలు పని ప్రారంభించినపుడు తాండవకృష్ణ వద్ద మాత్రం ఎంత డబ్బు ఉండేది? కాలం గడచిన కొద్దీ అతను సంపాదించాడు, కొన్ని సంవత్సరాల తర్వాత మనవాడు మాత్రం సంపాదించడేమిటి?"

"అది కాదు కనకం.... ఈ రోజుల్లో స్వల్పవ్యవధిలోనే పెద్ద మొత్తం డబ్బు సంపాదించాలని ఎవరైనా భావిస్తే, అతను తన అంతరాత్మను ఎక్కడో తాకట్టు పెట్టి తీరవలసిందే........ సత్య నిష్ఠతో జీవించాలని ఎవరైనా తలపోస్తే మహాలక్ష్మి అంత సులభంగా అతని వద్దకు చేరదు. ఏదైనా ఒక వ్యాపారంగానీ, పరిశ్రమ గానీ స్థాపించే స్తోమత ఉన్న వ్యక్తులకు కూడా సంపాదన ఒక పరిమితికి లోబడే ఉంటుంది. ఎందుకంటే వాళ్ళు ఎన్నో పన్నులు కట్టాల్సి ఉంటుంది. వ్యాపారంలో అధికలాభాలు ఆర్జించాలని ఎవరైనా అనుకుంటే ఎందరినో మోసగించకతప్పదు. ప్రజల్ని మోసం చేసేవాడు ప్రభుత్వాన్ని మాత్రం మోసగించడా? కానీ మనవాడు ఇట్లా కక్కుర్తి పడి ధనం సంపాదిస్తాడని నీవు విశ్వసించగలవా? లేదు... కనకం.... లేదు, వాడు మన రక్తంతో పుట్టిన వాడు, పరులను వంచించి, మోసగించి వాడు ధనవంతుడు కావద్దు. తాంవడకృష్ణతో సరితూగటానికి వాడే ప్రయత్నం చేయనవసరంలేదు. వాడు న్యాయబద్ధంగా సంపాదించి, న్యాయంగా జీవిస్తే చాలు. ఎంత ఎక్కువగా సంపాదించినా పోయేటప్పుడు ఎవరూ వెంటతీసుకొని పోయేదేమీ ఉండదు. బతకడానికి .... ఒక విధంగా మంచిగా బతకడానికి కావలసినంత డబ్బు సంపాదిస్తే చాలు, కాదా! దానికంటే కూడా ఎక్కువ ధనలాభం కలిగినా అప్పటి వరకూ ఉన్న మనశ్శాంతిని నష్టపోతాము. కానీ, ఇలాంటి ఆలోచనలు తాండవకృష్ణకి చాలా దూరంగా ఉంటాయి. అతనికి ధనమే దైవం. డబ్బు కొరకు అతను ఏమైనా చేస్తాడు.

తాండవకృష్ణతో ఎవ్వరు కూడా చేయించలేని పని డబ్బు చేయిస్తుంది. అతను నా మిత్రుడన్న మాట నిజమే. అయితే ఒక విషయం మాత్రం ఖచ్చితంగా చెప్తాను. డబ్బు విషయంలో అతను ఒక రాక్షసుడు, అతను చెడ్డవాడే,

కొడుకు రౌడీయే కానీ కూతురు మాత్రం సర్వ సుగుణాలరాశి. నీకు ఆ అమ్మాయి చాలా నచ్చింది. ఎంత వినయం, పెద్దల పట్ల ఎంత ఆదరణ, మన అబ్బాయికి మంచి జోడి అవుతుంది. వారిద్దరి వివాహం అతి త్వరగా జరపాలని నాకు కోరిక కూడా ఉంది. కానీ ఈ విషయంలో ఆ కర్కోటకుడు ఒప్పుకుంటాడా అని నాకు ఒక బలమైన సందేహం ఉంది. ఆ ఇంటికి కావాల్సింది వాళ్ళ పద్ధతిలో నడిచే ఒక అల్లుడు. తన సొంత కూతురుకు అన్ని సద్గుణాలు గల వరుడు దొరకడం మహాభాగ్యం అని ఆ మహాపాతకి అనుకోడు. వాళ్ళకి కావాల్సింది అన్ని దుర్గుణాలు గల ఒక డబ్బు సంచి మాత్రమే. ఏమైనా, నేను ఒకసారి వెళ్ళి అతనితో మాట్లాడి చూస్తాను.

ఆ రాత్రి నాగభూషణానికి, కనకలక్ష్మికి నిద్ర రాలేదు. మర్నాడు ఆదివారం కావడం వల్ల తాండవకృష్ణ ఇంట్లోనే ఉంటాడనుకొని నాగభూషణం ఉదయం పదిన్నర గంటలకల్లా అక్కడికి చేరాడు. ఎక్కువ ఉపోద్ఘాతమేమీ చెప్పకుండా అతను తటపటాయిస్తూనే తాండవకృష్ణతో అసలు విషయం వ్యక్తం చేసాడు. అది విని తాండవకృష్ణ కొద్దిసేపు బిగ్గరగా నవ్వాడు. అకారణంగా అతను నవ్వడం విన్న నాగభూషణానికి ఆశ్చర్యం, భయం, జుగుప్స ఒకేసారి కలిగాయి. ప్లీడరు గారికి పిచ్చిముదిరిందేమో లేక అతను పరిహసిస్తున్నాడేమో అనే సందేహబాధతో నాగభూషణం తల కిందికి వంచి కూర్చున్నప్పుడు "ఒరే నాగభూషణం! చిన్నప్పటి నుండి మనిద్దరం ప్రాణస్నేహితులం. నీకు నామీద ఎంతో మమత ఉందని నాకు తెలుసు అందుకే కదా! నీ సర్వస్వమైన పుత్రరత్నాన్ని నాకు అల్లుడుగా ఇద్దామని అనుకున్నావు. థాంక్స్ రా మిత్రమా! చాలా థాంక్స్ నీ మంచి మనస్సు గురించి నేను ఎల్లప్పుడూ నీకు ఋణపడి ఉంటాను. ఇంత మంచి యువకుణ్ణి స్వీకరించడానికి మా కుటుంబానికి అర్హత ఉందా అని నీవు ఆలోచించావా? ఈ ఇంటితో సంబధం పెట్టుకో గలడా మీ అబ్బాయి."

"అయ్యొ్మ సార్! మీరు అలా అనకండి వాళ్ళు ఒకరినొకరు ఎప్పుడో

ఇష్టపడ్డారు......" అని నాగభూషణం నసుగుతూ చెప్పాడు.

"నాగభూషణం! ఈ వయస్సులో ఉన్న యువతీ యువకుల మధ్య ప్రేమ, ఆకర్షణ, ఆరాధన అంకురించడం ప్రకృతి విరుద్ధమైన విషయమేమి కాదు. ప్రేమ గుడ్డిదని ఎవరో పెద్దలు చెప్పారు కదా! అందుకే మన పిల్లల భవిష్యత్తు గురించి ఎన్నో విషయాలు వాళ్ళకు అర్థమయ్యేటట్టు చెప్పడం మన ధర్మం. పరస్పరం దగ్గరైన యువతీ యువకులకు వారు కలిసి గడపబోయే జీవితంలో ఎదుర్కొనే సమస్యల గురించి ఎటువంటి ముందుచూపు గానీ, ఆలోచన గానీ, అవగాహన గానీ ఉండకపోవచ్చు. వాళ్ళతో స్పష్టంగా, నెమ్మదిగా చర్చించి, వాళ్ళకు సరైన దారి చూపడం మన కర్తవ్యం."

ఈ మధ్యలో పనిమనిషి టీ, బిస్కెట్లు తీసుకువచ్చి వారి మధ్యనున్న చిన్న టేబుల్ మీద పెట్టి వెళ్ళింది. వకీలు చెప్పినట్టు నాగభూషణం తినడానికేమీ తీసుకోలేదు గానీ చేతిలోకి టీ కప్పును మాత్రం తీసుకున్నాడు. తాండవకృష్ణ తేనీరు రుచి ఆస్వాదిస్తూ, "వివాహం అనేది యువతీ యువకుల మధ్య మాత్రమే ఏర్పడే బంధం కాదు. అలా కాకూడదని కూడా లేదు. అమెరికా లాంటి పాశ్చాత్యదేశాలలోని యువతీ యువకులు వివాహానంతరం తమ తల్లితండ్రులను ఏ రెండు సంవత్సరాలకో, ఐదు సంవత్సరాలకో ఒకసారి కలుస్తూఉంటారు. నీ విషయం, నా విషయం అలాకాదు కదా! మీ కొడుకు పెళ్ళి ఐనా, మా కూతురి పెళ్ళి ఐనా అది రెండు కుటుంబాల మధ్య సంబంధానికి దారి తీయాలి. నాకు ఇద్దరు పిల్లలున్నారు. నీకైతే ఒక్కడే కొడుకు. వాళ్ళ పెళ్ళిళ్ళ తర్వాత వాళ్ళు మనకు దూరంకాకూడదు. నా భార్య అకాల మరణం తరువాత, నా ఇద్దరి పిల్లలకు నేను తల్లిగా, తండ్రిగా వర్తించాను. రెండోపెళ్ళి గురించి ఇంతవరకూ నా మనసులో ఒక ఆలోచన కూడా రాలేదు. ఇక ముందు కూడా నాకు అలాంటి ఉద్దేశం రావడానికి వీలులేదు. ఈ ఇంటికి అల్లుడుగా వచ్చేవాడు ఈ ఇంటిలో ఒక కుటుంబ సభ్యుడిగా కావాలని నా కోరిక. నా కూతురిని

అత్తగారింటికి పంపించాలనే ఆలోచనని తట్టుకోవడమే నాకు కష్టంగా ఉంది. నా ముసలితనంలో నా కూతురు నన్ను తన బిడ్డలాగా చూడాలని ఆశిస్తున్నాను. కానీ, ఆమె అలా చూస్తుందో లేదో నాకు తెలియదు. ఆమె భర్త నాతో మంచిగా ఉంటాడా లేదా అని కూడా నాకు తెలియదు. కానీ, నా మనసులో ఉన్న కోరికను మీముందు వ్యక్తం చేస్తున్నాను. నీకు కూడా నీ కొడుకుని నష్టపోవటం ఇష్టం ఉండదు కదా! మీ కోడలు మీ ఇంటికి వచ్చి మీతో కలిసి ఉండాలనే కోరిక నీకు నీ భార్యకు తప్పకుండా ఉంటుంది. అది చాలా అవసరం కూడా. మన ఆచారం కూడా అదే. వీరిద్దరికి వివాహం జరిగితే దానివలన మనిద్దరిలో ఒకరికి అసంతృప్తి, వ్యథ కలగక తప్పదు, కాబట్టి, ఎంత బీదవాడైనా సరే, ఇల్లరికానికి ఒప్పుకొనే ఒక అల్లుడు నాకు కావాలి. అదే విధంగా బీదరాలైనా, ధనవంతురాలైనా మీతో కలిసిపోయే కోడలే కావాలి మీకు."

"మనకు ఇంత వయసొచ్చింది కదా! ఇక మన శేష జీవితాన్ని పిల్లల సంతోషం కొరకు ఖర్చుపెట్టడమే సమంజసం?" అని అడగకుండా ఉండలేకపోయాడు నాగభూషణం.

"నాగభూషణం, నేను దేవుడితో సమానమైన వాడిని కాదు, చాలా ఉదాత్త స్వభావం గల మనిషిని కూడా కాదు నేను. నేనొక మామూలు మనిషిని. నా ఇద్దరి పిల్లలకి నేను ఎంతగానో ప్రేమా, వాత్సల్యాలు పంచిపెట్టాను. దానికి ప్రతిఫలంగా, నా ముసలితనంలో వారి శ్రద్ధా, పరిచర్యలు, నాకు లభించి తీరాలి. అలా లభించకపోతే నేను దౌర్భాగ్యుడనని ఎంతో దుంఖిస్తాను. అలా దుఃఖించడం నాకు ఇష్టం లేదు. పిల్లలు అలా చేయకపోతే నేను వాళ్ళని నిందిస్తాను, శపిస్తాను, ద్వేషిస్తాను. కానీ, అలా జరగడం కూడా నాకు ఇష్టం లేదు. అందుకే నేను నా పిల్లలకి బుద్ధి చెపుతాను. నీవు కూడా నీ కొడుకుకి నచ్చజెప్పు. ఆదర్శధీరుడైన నీ కొడుకుకి ఈ కుటుంబంతో కలిసిమెలసి ఉండటం కష్టం. ఆ విషయం నీకు బాగా తెలును. కూతుర్ని నష్టపోవడమంటే నాకు భరించడం కష్టం. అదే

విధంగా నీ కొడుకుని నష్టపోవడం నీకు నీ భార్యకు కూడా అసహనీయంగా ఉంటుంది. అందుకే మన ఇద్దరి కుటుంబాల సంతోషకరమైన భవిష్యత్తు కోసం ఈ ఆలోచనని ఉపేక్షిద్దాం. ఇక మనం చెయ్యాల్సింది ఒకటే ఉంది అది మన పిల్లలకు బుద్ధి చెప్పడం."

ఇంత స్పష్టంగా వివరాలు చెప్పిన తరువాత కూడా అతనితో ఇక మాట్లాడి లాభం లేదని నాగభూషణం లేచి నిలబడ్డాడు. అక్కడ నుంచి వెళ్ళిపోయే ముందు

"ఏదేమైనా మీరు మీ అమ్మాయితో ఒకసారి మాట్లాడి చూడండి. నేను కూడా హరితో మాట్లాడి చూస్తాను." అని చెప్తూ నాగభూషణం ముందుకు అడుగులు వేస్తూ ఉంటే,

"చూస్తానంటే చాలదు చేస్తాను అనాలి." అని సుప్రింకోర్టులో చీఫ్‌జస్టిస్ తీర్పు ఇచ్చినట్లు తాండవకృష్ణ గట్టిగా చెప్పాడు.

తీవ్ర నైరాశ్యమనే మోయలేని బరువు మోస్తూ ఇంటికి తిరిగివచ్చిన నాగభూషణం, కనకలక్ష్మితో జరిగిన విషయాలన్నీ వివరంగా చెప్పాడు. ముందుకు వెళ్ళడానికి దారిలేని సందులో ఇరుక్కుపోయినట్టు వాళ్ళిద్దరికి ఇంక ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

కనకలక్ష్మి హరికుమార్‌తో ఈ విషయం గూర్చి సావకాశంగా మాట్లాడింది. హరి అది విని నవ్వసాగాడు.

"అమ్మా! ఆయన నాన్నగారిని అవహేళన చేయకుండా వదిలేయడమే నాకు ఆశ్చర్యంగా ఉంది. ఈ విషయం నా ముందు ఎత్తడానికి, నీకు ఎంతధైర్యం? నీ అంతస్తేమిటి? నా అంతస్తేమిటి? మరోమారు ఈ ఇంట్లో అడుగు పెట్టావంటే

నీ కాళ్ళు విరగ్గొడతాను, అని అరుస్తూ అతను నాన్నగారిని బయటికి గెంటేస్తాడని నేను భయపడ్డాను. మా మామగారు ఇంత మర్యాదగా వ్యవహరిస్తాడని నేను అనుకోలేదు. కనీసం అందుకైనా అయనకి ఋణపడి ఉండాలి. ఈ విషయం అతను అంగీకరించడని అనూరాధకు ముందే తెలుసు. అయినా కూడా, ఈ రోజో రేపో ఈ విషయం ఆయనతో ఆమె మాట్లాడబోతుంది. వేరెవ్వరినీ చేసుకోనని ఆమె ఖచ్చితంగా చెప్పబోతుంది. దానికి ఆయన ప్రతిస్పందన భయంకరంగా ఉంటుందని కూడా తెలుసు. కానీ, మేమిద్దరమూ రాబోతున్న ప్రతిబంధాలన్నిటిని ధైర్యంతో ఎదుర్కోవడానికి ప్రతిఘటించటానికి సిద్ధంగా ఉన్నాము."

"కానీ బాబూ! ఆయన ఏ ఘోరానికైనా పాల్పడే మనిషి కదా?" అని భయాక్రాంత అయిన ఆ తల్లి అడిగింది.

"ఆయన ఏం చేసినా ఫరవాలేదు, మేమిద్దరం వయస్సు వచ్చిన వాళ్ళమే కదా? చట్టాల గురించి ఆ వకీలుకు బాగా తెలుసుంటుంది. ఏరోజైనా ఆమె ఆ ఇల్లు వదిలి ఇక్కడికి రావడానికి సిద్ధంగా ఉంది."

"కానీ మీకు అతనేదైనా అపాయం కలిగిస్తే"

"ఎవరికీ భయపడి మేము ఆత్మహత్య చేసుకోము. మేము బతకాలి ..... కలిసి బతకాలి. దానికోసం, ఎవరెన్ని విఘ్నాలు కలిగించినా మేము పట్టించుకోము."

"బాబూ! మీ నాన్నగారికీ నాకూ అతనంటే చాలా భయం. అతను మనుష్యుల్ని చంపడానికి కూడా వెనుకాడడు."

"అతను ఎలాంటి వాడైనా కానీ ఏం చేసినా కానీ, మా నిర్ణయానికి మాత్రం తిరుగులేదు. అమ్మా! నీవేం భయపడవద్దు. ఏదైనా ఎదుర్కొనడానికి సిద్ధపడే మేము ఈ నిర్ణయానికి వచ్చాము. నువ్వే నాన్నగారికి కూడా ధైర్యం చెప్పాలి. మాకేం కాదు మీమిద్దరమూ కూడా అడ్వకేట్లమే కదా! న్యాయం, చట్టమూ అన్నీ తెలిసిన న్యాయవాదులే భయపడితే ఎలా?"

దాదాపు ఇదే సమయంలో తాండవకృష్ణ ఇంటిలో కూడా ఇలాంటి చర్చే జరిగింది. ఆ విషయాన్ని తాండవకృష్ణ కదిపాడు. నాగభూషణం ఆ ఇంటికి రావటం, అతనితో జరిపిన చర్చలు గురించి అతను అనూరాధకు వివరించాడు. నాగభూషణం వేళ్ళేముందు తన కొడుక్కి నచ్చజెప్తానని వాగ్దానం చేసి వెళ్ళిపోయాడని కూడా అనూరాధతో చెప్పాడు.

"నచ్చజెప్పడానికి మేమేమైనా చిన్నపిల్లలమా? న్యాయమూర్తి సమక్షంలో వాదించి న్యాయస్థానాన్ని నమ్మించడంలో నిష్ణాతులైన మాకు మా జీవితం గురించి ఆలోచించి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం లేదనా మీరనేది?" అని అనూరాధ చాలా శాంతంగా కానీ దృఢంగా అడిగింది.

"అమ్మా...... మనుష్యులు ఒక్కో వయసులో ఒక్కొక్క విధంగా ఆలోచిస్తారు. ఈ రోజు నీకున్న ఆలోచనాసరళి రేపు నీ పిల్లలు వివాహప్రాయానికి వచ్చేటపుడు ఉండకపోవచ్చు. ఇవాళ మన ఇద్దరి అభిప్రాయాల మధ్య పెద్ద అంతరం ఉండొచ్చు. ఇప్పుడు నేను ఇస్తున్న ఉపదేశాలు నీకు నచ్చకపోవచ్చు. నా ఆలోచనారీతి ఈ కాలానికి పనికిరాదని నీవనుకుంటే దానిలో తప్పలేదు. స్వయంగా నిర్ణయాలు తీసుకునే పరిపక్వత సామర్థ్యం నీకు ఉన్నాయంటే నేను గర్విస్తాను. మీ అమ్మ నన్ను ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోయేటపుడు, 'ఓసి పిచ్చిదానా! నువ్వు నన్ను వదిలి వెళ్ళిపోతే నాకు మరో సుందరాంగి దొరకదనుకుంటున్నావా?' అని నేను అనుకోకపోవడం నా బుద్ధితక్కువ

తనమని నువ్వు అంటావేమో. నా పిల్లలిద్దర్నీ ఏ బోర్డింగ్ స్కూల్‌కో అప్పజెప్పేసి ఒక కొత్త వధువుతో సుఖంగా కాలం గడపకపోవడమూ నా పొరపాటేనని నా పిల్లలే అనవచ్చు. పిల్లలకి బుద్ధులు చెప్పడానికి తల్లితండ్రులకి అధికారం ఉంది కానీ, ఒక వయస్సు వచ్చిన తరువాత వాళ్ళ నిర్ణయాలు వాళ్ళే తీసుకోడానికి అడ్డుపడటం సబబు కాదని అడ్వకేటు ఐన నువ్వు అంటావేమో! ఏది ఏమైనప్పటికీ, కుటుంబ శ్రేయస్సు కొరకు, కొన్ని అప్రియమైన నిర్ణయాలు తీసుకోవడం గానీ, మూర్ఖంగా ప్రవర్తించడం కానీ, కొందరికి తప్పదు. దీనికి కొందరు త్యాగమని పేరు పెడతారు. తన సుఖసౌకర్యాల కోసం తీసుకునే నిర్ణయాలు, తన కుటుంబ మనుగడకు తోడ్పడవని అనిపించినపుడు కొంత త్యాగబుద్ధితో వ్యవహరించాలా వద్దా అనే విషయం ఆ వ్యక్తి కూలంకషంగా ఆలోచించి నిర్ణయించుకోవాలి. హరి ఈ కుటుంబ సభ్యుడు కావడం, నీకు గానీ, మీ అన్నయ్యకు గానీ, ఆమోదయోగ్యం కాదు. నువ్వు అతనికోసం మమ్మల్ని వదిలి వెళ్ళిపోవడం మాకు ఎంతో బాధాకరంగా ఉంటుంది. నువ్వు ఎప్పటికీ మాతోనే ఉండిపోవాలని కోరుకోవటం మా స్వార్థమే. కానీ ఏం చేస్తాం? నువ్వు నాకు ఒక్కగానొక్క కూతురివి. మనందర్నీ విడిచి వెళ్ళిపోయిన మీ అమ్మ ప్రతిరూపానివి నువ్వు. నువ్వు మీ అన్నయ్యకు ఒకే ఒక ముద్దుల చెల్లాయివి. నువ్వు లేని బతుకు గురించి ఆలోచించడమే నాకూ, మీ అన్నయ్యకు సాధ్యం కాదు, హరి చాలా మంచి కుర్రవాడని అందరూ ఒప్పుకుంటారు. కానీ, ఉన్నతాదర్శాలని అక్షరాలా ఆచరించాలని అభిలషిస్తున్న ఆ అబ్బాయికి మన కుటుంబంతో కలిసిమెలిసిపోవడం సాధ్యం కాదు. ఈ ఇంటి వాతావరణంలో అతను ఇమడలేడు."

ఈ సందర్భంలో ఆ ప్రసంగప్రవాహానికి అడ్డుకట్ట వేయకుండా ఉండలేకపోయింది అనూరాధ

"మీరన్నది కరక్టే, మిమ్మల్ని వదిలి వెళ్ళిపోవటం నాకు మాత్రం ఇష్టమేనంటారా? ఆదర్శాలు హరికొక్కడికే కాదు. చాలా ఆదర్శపూర్ణమైన

జీవితాన్ని సాగించాలనేదే నా అభిలాష కూడా. ఆ విధంగా చూస్తే, ఈ కుటుంబ వాతావరణంతో సర్దుకుపోవడం నాకు కూడా కష్టంగా ఉంది. ప్రాపంచిక సుఖాలకోసం ప్రాకులాడుతున్న ఈ జీవితానికి భిన్నమైన ఒక ఆదర్శజీవితం గడపాలని నా ఉద్దేశం. ఈ ఇంట్లో జరుగుతున్న అపరిమితమైన ఐశ్వర్య సంపాదన నాకు ఊపిరాడనివ్వటం లేదు. నా జీవితలక్ష్యం లక్ష్మీపూజ కాదు. సాధ్యమైనంతలో సరళమైన జీవితాన్ని గడపాలనే నా కోరిక.

"అయితే మమ్మల్ని వదిలి వెళ్ళటానికి నీకేమి అభ్యంతరం లేదనా నువ్వనేది."

"మీరు మీ సొంత కుటుంబాన్ని ఏర్పర్చుకున్నట్లు నాకు కూడా నాది అని చెప్పే ఒక చిన్న కుటుంబం ఉండాలనే నా కోరిక. ఉమ్మడి కుటుంబంలో ఉండే అనుభవం మనకు ఇంతవరకు లేదు కదా?"

"అది ఎందుకంటే నేను పల్లెటూరు వదిలేసి సిటీకి వచ్చేశాను కదా!"

"కారణాలేమైనా సరే నాకు ఒక ఉమ్మడి కుటుంబంలో ఉండటం ఇష్టం లేదు. నాకు కొన్ని కలలూ, ఆశయాలు, అభిలాషలు ఉన్నాయి. నా ఆశలు, కలలు, నేనొక గొప్ప వ్యక్తిని కావాలని కానీ, చుట్టూ ఉన్న వాళ్ళందరి కంటే ఎక్కువ ఆస్తులు సంపాదించాలనీ కాదు. హైకోర్టు చీఫ్‌జస్టిస్ కావాలని కూడా నాకు లేదు. ఎలక్షన్‌లలో నిలబడి ముఖ్యమంత్రిని అవ్వాలని లేదు. జీవితం నాకు న్యాయంగా ప్రసాదించినవన్నీ నేను సంతోషపూర్వకంగా స్వీకరిస్తాను. అవి ఆనందదాయకం కావచ్చు లేదా దుఃఖదాయకం కావచ్చు. జీవితంలో ఏమేమి జరిగినా కూడా, వాటిని సమచిత్తభావంతో ఆస్వాదించడానికి గానీ, భరించడానికి గానీ, నేను సిద్ధమే. ఇతరులకు అన్యాయం చేసి, నా గూడు పూలపాన్పు చేసుకోవటం నాకు ఇష్టం లేదు. నా ఆశాసౌధం కట్టుకోవడానికి

కావాల్సిన కాంక్రీటుతో ఇతరుల కన్నీరు కలపడం నాకు ఇష్టం లేదు. న్యాయమైన, లలితమైన పరోపకార ప్రదమైన బతుకే నాకు కావాలి."

"చాలు చాలు నీ అధికప్రసంగం ఆపు. నువ్వు అంత పెద్దదానివి కాలేదు. ఏరోజైనా నువ్వు నన్ను మించి ఎదగలేవు. తండ్రికి ముందు పుట్టిన కూతురు అని పేరు సంపాదించాలని నీకుంటే, అది ఈ ఇంట్లో సాధ్యపడదు. నీ విశృంఖల ప్రవర్తనకు నేను ఒప్పుకోను. నీ వివాహం నేను త్వరలో జరిపిస్తాను. కానీ, వరుడు మాత్రం నేను నిర్ణయించిన వాడే."

"దానికి నేను ఒప్పుకుంటే కదా! యుక్త వయస్సులో ఉన్న నా అభిప్రాయాలను కాలదన్నే అధికారం మీకు లేదు. అలాంటి అధికారం మీకు ఎప్పుడూ రాదు. బలప్రయోగం ద్వారా నా వివాహం మీరు వేరొకరితో జరపాలని అనుకుంటే దానికి నా శవమే మీకు లభిస్తుంది."

"చావాలంటే చావు. కానీ నువ్వు బతికుండగా నన్ను ధిక్కరించడానికి వీల్లేదు."

• • •

తండ్రీ, కూతుళ్ళ మధ్య ఈ వాగ్వివాదం జరిగిన వారం రోజుల తరువాత హరి, అనూరాధలు హఠాత్తుగా అదృశ్యమయ్యారు. వాళ్ళని వెదికి పట్టుకోవడానికి తాండవకృష్ణ, మురళీకృష్ణ అన్ని ప్రయత్నాలు చేశారు. మురళీకృష్ణ హరి ఇంటికి వెళ్ళి అతని తల్లితండ్రులను చితకబాది ప్రశ్నించడం జరిగింది. హరి, అనూరాధ కలిసి ఎక్కడికో వెళ్ళారని వాళ్ళకు తెలుసు కానీ, ఎక్కడికి వెళ్ళారో తెలియదు. కొన్ని రోజుల తరువాత హరి, అనూరాధల పెళ్ళి సర్టిఫికెట్టు ఒక కాపీ తాండవకృష్ణకు పోస్టులో వచ్చింది. కవరుపై ఉన్న పోస్టు ముద్రలను బట్టి

అది ఎక్కడనుంచి వచ్చిందో కనుక్కోవడానికి మురళీకృష్ణ చాలా శ్రమించాడు. అది హైదరాబాదులోనే పోస్టయ్యిందని తెలిసేసరికి, తండ్రీ కొడుకులిద్దరికీ పట్టలేని కోపం వచ్చింది. ఊరు విడిచి వెళ్ళిన ఆ నవ దంపతులు హైదరాబాదుకి తిరిగివచ్చుంటారేమోనని మురళీకృష్ణ ఊరంతా గాలించాడు. కానీ ఫలితం శూన్యం. ఇంక చెయ్యవలసిన దాని గురించి వారిద్దరూ చర్చించారు. వాళ్ళకి హరిని చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది కానీ, ఒక నెలరోజుల తరువాత తాండవకృష్ణ కోపం కొంత ఉపశమించింది. ఇంకా ఆవేశం తగ్గని కొడుకుని పిలిచి, "ఇంక ఆ విషయం నువ్వు మరచిపో. ఆమె నా కూతురు కాదు, నీకు చెల్లాయి కూడా కాదు. వాళ్ళు నీకు ఎక్కడైనా కనబడితే వాళ్ళ మీద చేయిచేసుకోవద్దు. వాళ్ళతో మాట్లాడవద్దు." అని వయస్సువల్ల కొంత వరకూ పరిపక్వత వచ్చిన ఆ తండ్రి ఉపదేశించాడు. "కానీ డాడీ! అతనిని అంత తేలికగా వదలకూడదు. కనీసం ఒక కాలో, చెయ్యో విరగ్గొట్టాలి. నేను ఏమీ చేయను. వేరెవరితోనైనా ఆ సత్కార్యాన్ని పూర్తి చేయిస్తాను."

"అదే వద్దంటున్నా. అనూరాధతోనే సంబంధం తెగిపోయినపుడు అతనితో మనకేం పని? వాళ్ళ బతుకు వాళ్ళని బతకనీయి లేదా చావనీ! ఆ మాటకొస్తే నువ్వు అతని తల్లి తండ్రులను కొట్టడం కూడా తప్పే. ఎంతైనా ముసలాడు నా బాల్యస్నేహితుడే కదా! నీలో ఉడుకురక్తం పాలు ఎక్కువే ఉంది. నిన్ను నువ్వు కొంచెం సంబాళించుకోవాలి. ఈ ఆవేశకావేశాల కంటే నాలుగురాళ్ళు సంపాదించే మార్గం చూసుకో."

అప్పటి మటుకు మురళికి ఆ హితబోధ నచ్చలేదు కానీ, క్రమేపి అతని కోపం తగ్గసాగింది. రెండు నెలల అజ్ఞాతవాసం తరువాత హరి, అనూరాధలు హైదరాబాదుకు తిరిగివచ్చారు. మురళి తన తల్లితండ్రులను కొట్టడం గురించి హరికి చాలా బాధ కలిగింది.

"బాబు! జరిగిందేదో జరిగిపోయింది. అది మరచిపో. మీ ఇద్దరి క్షేమం